# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 27 । నవంబర్ । 2022






**వీకెండ్ సందడి**

జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో సందడి నెలకొంది. వీకెండ్ కావడంతో భారీగా తరలివచ్చారు. IIలో



**'పాల్లూరు'కు టోల్‌గేట్**

మోతుగూడెం పంచాయతీ పొల్లూరు జలపాతానికి వెళ్లే మార్గంలో టోల్‌గేట్‌ను ప్రారంభించారు. IIలో



**నాణ్యత ప్రమాణాలు పాటించాలి**

రేషన్ షాపుల్లో సరైన తూకంతో పాటుగా నాణ్యత ప్రమాణాలను పాటించాలని జేసీ శివ శ్రీనివాస్ ఆదేశించారు. IIలో

# రూ.982.88 కోట్లతో జెడ్పీ బడ్జెట్

- సభ్యుల ఆమోదం
- సమస్యలపై సమగ్ర చర్చ
- ప్రజాప్రతినిధులు స్కూళ్లను సందర్శించవచ్చన్న మంత్రి అమర్‌నాథ్
- ఏజెన్సీ సచివాలయాలకు రూ.40 లక్షలు మంజూరుపై హర్షం
- మూడు రాజధానులకు మద్దతుగా సభ్యుల ఏకగ్రీవ తీర్మానం
- ప్రశాంతంగా సాగిన జెడ్పీ సర్వసభ్య సమావేశం




జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తదితర అధికారులు

సాక్షి, విశాఖపట్నం: జిల్లా పరిషత్, ఇతర నిధులు వెరసి 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.982.88 కోట్ల ఆదాయం సమకూరుతుందని, రూ.980.93 కోట్ల వ్యయం అవుతుందని జెడ్పీ అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. దీనిని శనివారం జరిగిన సర్వ సభ్య సమావేశం ఆమోదించింది. అలాగే 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.1155.23 కోట్ల ఆదాయానికి రూ.1143.21 కోట్ల వ్యయంతో సవరణ బడ్జెట్‌కు కూడా ఆమోదం తెలిపింది. మూడు రాజధానులకు మద్దతుగా సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఉమ్మడి విశాఖకు సంబంధించిన వివిధ అంశాలు, సమస్యలపై సమగ్రంగా చర్చించారు. సమావేశానికి హాజరైన జిల్లా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ జగనన్న కాలనీ ఇళ్లలో డిసెంబర్ 21 నాటికి సామూహిక గృహప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలని గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయాలకు రూ.20 లక్షలు మంజూరు చేస్తోందని, అయితే ఏజెన్సీ ప్రాంతంలో పంచాయతీల పరిధిలో గ్రామాలు ఎక్కువగా ఉన్నందున అక్కడ సచివాలయాలకు అదనంగా మరో రూ.20 లక్షలు మంజూరు చేసేందుకు సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారని మంత్రి తెలిపారు. దీనివల్ల గిరిజన గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందుతాయన్నారు. సీఎం నిర్ణయంపై పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రలతో పాటు గిరిజన జెడ్పీటీసీలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనుల పరిశీలనకు తమను ఉపాధ్యాయులు అనుమతించడం లేదని పలువురు జెడ్పీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి అమర్‌నాథ్ ప్రజాప్రతినిధులు స్కూళ్ల సందర్శనకు వెళ్లవచ్చని, అలా అడ్డుకునే వారిపై చర్యలు తీసుకుంటామని, మరోసారి ఇలాంటి ఫిర్యాదులు వస్తే డీఈవోలు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**ఏజెన్సీ నిధులను మురిగిపోనీయొద్దు..**

అల్లూరి జిల్లాలో మార్చికల్లా ఉపాధి పనులు చేపట్టకపోతే రూ.88 కోట్ల నిధులు మురిగిపోయే ప్రమాదం ఉందని అవసరమైన పనులు సత్వరమే చేపట్టాలని మంత్రి అమర్‌నాథ్‌అధికారులను ఆదేశించారు. తమ మండలంలో ఉపాధి హామీ పనుల్లో రోడ్లు వేయకుండానే వేసినట్టు చూపి రూ.8 కోట్ల స్వాహా చేశారని అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం తప్పిదాల వల్ల రాంబిల్లి ఎన్‌ఏవీబీ నిర్వాసితులకు అన్యాయం జరిగిందని వారి సమస్యను పరిష్కరించాలని గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. దీనిపై స్పందించిన మంత్రి.. ముఖ్యమంత్రి ఓ సీనియర్ అధికారిని నియమించి సమస్య పరిష్కరించనున్నారని తెలిపారు. ప్రభుత్వ టీచర్లు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకుండా నోటీసులు జారీ చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర డీఈవోలను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నాడు–నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి చెందేలా చూడాలని అధికారులను కోరారు. కేజీహెచ్ ఎస్టీ సెల్‌లో సేవలందించే సిబ్బందిని ఏజెన్సీ గిరిజనులనే నియమించాలని గిరిజన జెడ్పీటీసీలు కోరారు.

**బినామీలకు ఇళ్లు రద్దు**

జగనన్న కాలనీ ఇళ్లను కొంతమంది బినామీలకు విక్రయిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ సమావేశంలో చెప్పారు. కొన్ని చోట్ల ఇలాంటివి జరుగుతున్నాయని, వాటిని రద్దు చేసి అర్హులకు కేటాయించాలని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సూచించారు. కోర్టు కేసుల వల్ల ఇళ్ల నిర్మాణం జరగని గ్రామాల్లో మరోచోట కేటాయిస్తామని విశాఖ జేసీ విశ్వనాథన్ చెప్పారు. కాగా మండల సమావేశాలకు కూడా అధికారులు హాజరు కావడం లేదని, వారు హాజరయ్యేలా చూడాలని పలువురు సభ్యులు కోరారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అనకాపల్లి హౌసింగ్ పీడీకి మెమో జారీ చేయాలని మంత్రి... జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తిని ఆదేశించారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, విశాఖ జేసీ విశ్వనాథన్, అల్లూరి జిల్లా జేసీ శివశ్రీనివాస్, అనకాపల్లి ఎంపీ సత్యవతి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కె.భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

## మన్యంలో త్వరలో డీఆర్సీ

- అరకు కాఫీ సాగు విస్తరణకు కృషి
- గిరి రైతులకు అండగా ప్రభుత్వం
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: త్వరలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో జిల్లా సమీక్ష సమావేశాన్ని (డీఆర్సీ) నిర్వహిస్తామని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. శనివారం జెడ్పీ సర్వసభ్య సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చిందని, ఇటీవల కొన్ని దేశాల ప్రతినిధులు సీఎంను కలిసినప్పుడు అరకు కాఫీ గొప్పదనాన్ని కొనియాడారన్నారు. ఇంకా పెద్ద ఎత్తున అరకు కాఫీ పంటను విస్తృతం చేయాలని ఆ ప్రతినిధులు కోరారని, అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. ప్రపంచ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిన గిరి రైతులకు అండగా ఉంటామన్నారు. జిల్లాల విభజన తర్వాత ప్రజలకు సుపరిపాలన అందేలా వ్యవస్థలు అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి చెప్పారు. అనకాపల్లి జిల్లాలో 24, ఏజెన్సీలో 11, విశాఖ జిల్లాలో నాలుగు చొప్పున గ్రామీణ మండలాలున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇకపై అనకాపల్లి జిల్లా కేంద్రంలో జెడ్పీ సీఈవో వారంలో మూడు రోజులు అందుబాటులో ఉంటూ అక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తారని చెప్పారు. అలాగే అనకాపల్లిలో పూర్తి స్థాయి జెడ్పీ డిప్యూటీ సీఈవో కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఐటీడీఏ పీఓ ఉంటారని అందువల్ల అక్కడ ఇలాంటి అవసరం రాదన్నారు. అధికారులు అందుబాటులో ఉండడం వల్ల సమస్యలు సత్వరమే పరిష్కారానికి వీలుంటుందన్నారు. వివిధ పనులకు సంబంధించిన ఏ ఒక్క బిల్లు పెండింగ్ ఉండరాదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని, అధికారులు అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటారని చెప్పారు.

## న్యూస్‌రీల్

### గాంధీనగరం నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు

సర్వే అనంతరం పంపిణీ: సబ్ కలెక్టర్



గాంధీనగరం కాలనీలో సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: భూపతిపాలెం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా నిర్వాసితులైన గాంధీనగరం గ్రామ గిరిజనులకు త్వరలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. గాంధీనగరం ఆర్‌అండ్ ఆర్ కాలనీలో శనివారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం నివాసం ఉంటున్న వారి ఇళ్లను సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీ తుర్రం వెంకటేశ్వర్లుదొర, వార్డు మెంబరు మడకం కుమారి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

### గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, వాహనంతో టాస్క్‌ఫోర్స్ ఏఈఎస్ రాజు, సిబ్బంది

పాడేరు రూరల్: పుష్ప సినిమా తరహాలో దర్జాగా తరలిస్తున్న గంజాయిని టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు ఏఈఎస్ రాజు తెలిపారు. ఒడిశాలోని పాడువ ప్రాంతం నుంచి అరకు మీదుగా గంజాయి తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్సు పోలీసులు అప్రమత్తమయ్యారు. డుంబ్రిగుడ మండలం కించుమండ వారపు సంత వద్ద కాపు కాశారు. హుకుంపేట నుంచి అరకు వైపు వెళ్తున్న బొలేరా వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో తరలిస్తున్న 130 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఒడిశాలోని కోరాపుట్టు జిల్లా పాడువ మండలం శేఖరిపుట్టు గ్రామానికి చెందిన పాంగి మాహేశ్వర్, అరకు మండలం ఆర్.డుంబ్రిగుడకు చెందిన కిల్లో రమేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వాహనాన్ని, నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఏఈఎస్ రాజు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్సు సీఐ కూర్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆదివాసీల వినూత్న నిరసన

పూర్తిస్థాయిలో ఏజెన్సీ చట్టాల అమలుకు డిమాండ్



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

ఎటపాక: ఏజెన్సీలో చట్టాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కుంజా అనిల్ కోరారు. శనివారం ఎటపాక మండల కేంద్రంలో కళ్లకు గంతలు కట్టుకుని రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 రోజులుగా ఆదివాసీలు భూపోరాటం చేస్తున్నా అధికారుల నుంచి స్పందన కరువైందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూర నాగేష్, రాంబాబు, రాఘవయ్య, ఆనంద్, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న క్రీడా సంబరాలకు ఏర్పాట్లు

- ఈనెల 28,29 తేదీల్లో నిర్వహణ
- జిల్లా క్రీడాప్రాధికార సంస్థ జిల్లా ప్రధాన శిక్షకుడు జగన్మోహన్‌రావు

పాడేరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జగనన్న క్రీడా సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ జిల్లా ప్రధాన శిక్షకుడు జగన్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు క్రీడాంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ విభాగాల్లో నిర్వహిస్తామని తెలిపారు. 17 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయసు కలిగిన వారు మాత్రమే ఈ పోటీలకు అర్హులన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు సంబంధించిన జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లలో పేర్లు నమోదు చేసుకొని ఉండాలన్నారు. నిర్దిష్ట నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ఎంపికకు అర్హులన్నారు. క్రీడాకారుల ఆధార్ కార్డు నియోజకవర్గ చిరునామాతో కలిగి ఉండాలన్నారు.

**నియోజకవర్గ స్థాయిల్లో ఎంపిక తేదీలు :**

- అరకు నియోజకవర్గంలో ఈనెల 28న అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ, వాలీబాల్, ఏపీ ట్రైబల్ స్పోర్ట్స్ పాఠశాలలో క్రికెట్ పోటీల నిర్వహణ
- పాడేరు నియోజకవర్గంలో 28న పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు జరుగుతాయి.
- రంపచోడవరం నియోజకవర్గంలో ఈనెల 29న రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ క్రీడా పోటీల నిర్వహణ.

**పూర్తి వివరాలకు..**

అరకు నియోజకవర్గ ఇంచార్జి ఎం. భూపతిరాజు (6304301429), పాడేరు నియోజకవర్గ ఇంచార్జి జె. అమృతవాస్ (6303887787), రంపచోడవరం నియోజకవర్గ ఇంచార్జీ కె. పోతురాజు (9441563420)

## ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం



ఐటీడీఏలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఐటీడీఏ అధికారులు



రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



ఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న పోలీసులు

పాడేరు రూరల్ : ప్రపంచ దేశాల్లో మన రాజ్యాంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) తుహిన్ సిన్హా అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో సామాన్యులు సైతం అత్యున్నత హోదాకు చేరుకునేందుకు లిఖిత పూర్వకంగా భారత రాజ్యాంగం హక్కులు కల్పించిందన్నారు. రాజ్యాంగ విలువలు, ప్రతిష్టను ప్రతి ఒక్కరు గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

**ఐటీడీఏలో..:** ఐటీడీఏ సమావేశ మందిరంలో శనివారం భారత రాజ్యాంగా ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఏపీవో(పీటీజీ) ఎం. వెంకటేశ్వరరావు రాజ్యాంగ పీఠికలో పొందుపర్చిన పలు అంశాలను వివరించారు. గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఈఈ డీవీఆర్‌ఎం రాజు, ఐటీడీఏ పరిపాలనాధికారి హేమలత, సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం. సత్యవతి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

**ఏబీవీపీ ఆధ్వర్యంలో..**

అఖిల భారత విద్యార్థి పరిషత్ గిరిజన విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ అంగనైని ఆనంద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ ఎం.ఎల్ పాత్రుడు, ఎస్సీ,ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షుడు పాంగి సోములు, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ పాంగి రామయ్య, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గెమ్మెలి కల్యాణ్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక సెంటర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే మన దేశం అతి పెద్ద ప్రజాస్వామ్యం దేశంగా వెలుగొందుతోందన్నారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు తన స్వార్థ రాజకీయాలకోసం రాజ్యాంగానికి తూట్లు పొడిచారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెట్పీటీసీ ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ రైతు పక్షపాతి

- తమ ప్రభుత్వంలోనే అన్నదాత కళ్లల్లో ఆనందం
- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- జడ్డంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి మాత్రమే రైతు కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని జడ్డంగి రైతు భరోసాకేంద్రాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతు పక్షపాతి అని అన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులను అమ్ముకునేందుకు మూడేళ్లక్రితం వరకు ఎన్నో ఇబ్బందులు పడేవారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుకు అవసరమైన సహకారం పూర్తిస్థాయిలో అందిస్తోందన్నారు. వారికి చేదోడు వాదోడుగా ఉండేలా పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. దళారీ వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలించే లక్ష్యంతోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేసిందన్నారు. సొసైటీ, వ్యవసాయశాఖ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పారదర్శకంగా రైతులను నుంచి ధాన్యం సేకరిస్తారని ఆమె పేర్కొన్నారు. రైతుల నుంచి కొనుగోలుచేసిన ధాన్యానికి 20 రోజుల్లోగానే వారి ఖాతాల్లో నగదు జమ చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. గత ఏడాది మండలంలో 4194 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, వారికి రూ.8.13 కోట్ల మేర రైతులకు చెల్లింపులు జరిగాయన్నారు. దళారులు, బయట మార్కెట్లో విక్రయించి మోసపోవద్దని హితవు పలికారు. పార్టీ మండల కన్వీనర్, సొసైటీ చైర్మన్ శింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెట్పీటీసీ ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, అడ్డతీగల ఏడీఏ కంకిపాటి సావిత్రి, తహసీల్దార్ వైవీసుబ్రహ్మణ్యాచారి, ఎస్‌ఐ షరీఫ్ పాల్గొన్నారు.

## 'తాటిపూడి' గిరిజనులను ఆదుకుంటాం

ఎంపీడీవో శ్రీహర్షిత్



తాటిపూడి డ్యాం సమీపంలోని నాటు పడవల వద్ద గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీహర్షిత్

అనంతగిరి: తాటిపూడి డ్యామ్‌పై ఆధారపడి జీవిస్తున్న మండలంలోని చిలకల గెడ్డ పంచాయతీ జీలుగుల పాడు, మెట్టపాలెం, దబ్బల పాడు మూడు గ్రామాల గిరిజనులను ఆదుకుంటామని ఎంపీడీవో శ్రీహర్షిత్ తెలిపారు. మత్స్యకారులుగా గుర్తించాలని వారు ఐదు రోజుల క్రితం నిరసన తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమీత్‌కుమార్ ఆదేశాల మేరకు ఎంపీడీవో శనివారం ఎంపీడీవో శ్రీహర్షిత్, సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీలతో ఆయా గ్రామాలకు వెళ్లారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. కాశీపట్నం వారపు సంతలో చేపలు అమ్మకాలు చేపట్టేలా గిరిజనులకు షాపు కేటాయిస్తామన్నారు. సీసీడీపీ నిధుల నుంచి బోట్లు, వలలు, బూట్లు ఇవ్వాలని గిరిజనులు విన్నవించారని ఎంపీడీవో తెలిపారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

## రంగరాళ్ల తవ్వకాల నిరోధానికి నిరంతర నిఘా

అడ్డతీగల: తపస్వికొండ రక్షిత అటవీ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాల నిరోధానికి నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు ఎస్‌ఐ అప్పలరాజు తెలిపారు. ఇప్పటికే రంగురాళ్ల తవ్వకాలు జరిపేందుకు ప్రయత్నించిన ప్రాంతాల సమాచారం సేకరించామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో సిబ్బందిని షిఫ్టుల వారీగా పెట్రోలింగ్, నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు. రక్షిత అటవీ ప్రాంతాల్లో తవ్వకాలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు. అనవసరంగా తవ్వకాలకు వెళ్లి కేసుల్లో ఇరుక్కోవద్దని ప్రజలకు అవగాహన అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా క్వారీలు ప్రమాదకరంగా తవ్వకాలు సాగించడం వల్ల మట్టిపెళ్లలు విరిగిపడి విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తున్నందున వీటికి దూరంగా ఉండాలని ఎస్‌ఐ సూచించారు.

## ఆటో బోల్తా పడి ఒకరి మృతి


మల్లికార్జున(ఫైల్)

గూడెంకొత్తవీధి : కొయ్యూరు– గూడెంకొత్తవీధి మండలాల మధ్య బొంతువలస ఘాట్ రోడ్లో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తూర్పుగోదావరి జిల్లా గంగవరం గ్రామానికి చెందిన మల్లికార్జున(35) మరణించారు. గూడెం కొత్తవీధి ఎస్ఐ అప్పలసూరి అందించిన వివరాలివి. గంగవరం గ్రామానికి చెందిన కొందరు జి.మాడుగుల నుంచి కొయ్యూరు మండలం చీడిపాలెం బంధువుల ఇంటికి ఆటోలో వెళుతుండగా ఘాట్‌రోడ్లో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మల్లికార్జున తీవ్రంగా గాయపడి మృతి చెందాడన్నారు. ఈ ఘటనలో గాయపడిన మరికొందరిని చింతపల్లి ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## ‘పొల్లూరు’కు టోల్‌గేట్

### ప్రారంభించిన సర్పంచ్ సీత

మోతుగూడెం: మోతుగూడెం పంచాయతీ పొల్లూరు జలపాతానికి వెళ్లే మార్గంలో టోల్‌గేట్‌ను సర్పంచ్ ఆకేటి సీత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకొక్క పర్యాటకుడి నుంచి రూ.10 చొప్పున వసూలు చేస్తామని, ఆ నిధులతో జలపాతం వద్ద అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పర్యవేక్షణ లోపంతో గతంలో చాలామంది యువకులు మృత్యువాత పడ్డారని తెలిపారు. అలాంటి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, ఈఈ బాబూరావు, ఎస్ఐ వి. సత్తిబాబు, ఉప సర్పంచ్ మీనా సుజాత తదితరులు పాల్గొన్నారు.



## ఐటీడీఏ గెస్ట్‌హౌస్ నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ

- వచ్చే నెల 6వ తేదీ వరకు గడువు
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : చింతపల్లి మండలం లంబసింగి జంక్షన్‌లో ఉన్న ఐటీడీఏ గెస్ట్‌గాస్‌తో పాటు క్యాంటిన్ల నిర్వహణ నిమిత్తం రెండేళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు ఆసక్తి కలిగిన గిరిజన నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ తెలిపారు. చింతపల్లి మండల పరిధిలో టెన్త్ పాసైన 21 ఏళ్లు నిండిన గిరిజన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఈ గెస్ట్ హౌస్‌ను పూర్తిగా ఆధునీకరించి అందుబాటులోకి తెస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ గిరిజన యువత రూ.500 చెల్లించి దరఖాస్తులు పొందాలన్నారు. పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో ఈనెల 29 నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు డిసెంబర్ 6వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు పాడేరు ఐటీడీఏ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. గెస్ట్‌హౌస్ నిర్వహణ బాధ్యతలు పొందిన వారు గెస్ట్‌హౌస్, క్యాంటిన్లలో పని చేసే సిబ్బందిని చింతపల్లి మండల పరిధి వాళ్లనే నియమించుకోవాల్సి ఉంటుందన్నారు. గెస్ట్‌హౌస్, క్యాంటిన్ నిర్వహించేందుకు ఏడాదికి రూ.8 లక్షలు ఐటీడీఏకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అన్ని నియమ నిబంధనలతో కూడిన దరఖాస్తులను తీసుకొని వారిలో ఒకరిని లాటరి పద్ధతి ద్వారా ఎంపిక చేస్తామని చెప్పారు.

ఆసక్తి గల చింతపల్లి మండల గిరిజన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వాయన కోరారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

### జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్

సాక్షి, పాడేరు: రేషన్ షాపుల్లో సరైన తూకంతో పాటుగా నాణ్యత ప్రమాణాలను పాటించాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని సుండ్రుపుట్టు చౌక ధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణంలోని ఉన్న సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, బియ్యం కార్డుదారులకు అందించాలని, చౌక ధరల దుకాణాలు సమయపాలన పాటించి, బియ్యంకార్డుదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి శివ ప్రసాద్, పౌరసరఫరా కార్పొరేషన్ జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతాన్ని బయో స్పియర్ రిజర్వ్‌గా ప్రకటించాలి


రామ్‌గోపాల్

కొయ్యూరు: చింతపల్లి, గూడెంకొత్తవీధి ప్రాంతాల్లో ఉన్న అడవిని బయోస్పియర్ రిజర్వ్(జీవవరణం)గా కేంద్ర అటవీ పర్యావరణ శాఖ ప్రకటించాలని భారతీయ ఆదివాసీ సమాఖ్య ఏపీ అధ్యక్షుడు గడుతూరి రామ్‌గోపాల్ ఒక ప్రకటనలో కోరారు. ఆయా ప్రాంతాల్లో అరుదైన ఏకముఖి రుద్రాక్ష చెట్లతో పాటు వివిధ రకాల ఔషధ మొక్కలు ఉన్నట్టు తెలిపారు. ఈ కారణంగా ఈ ప్రాంతాన్ని బయోస్పియర్‌గా ప్రకటిస్తే వివిధ రకాల చెట్లు, జంతువులకు రక్షణ ఉంటుందని చెప్పారు. 2012లో అప్పటి కేంద్ర పర్యావరణ మంత్రి జైరాం రమేష్ ఈ ప్రాంతాన్ని బయోస్పియర్ రిజర్వ్‌గా ప్రకటించినా అమలు కాలేదన్నారు. గూడెం కొత్తవీధి మండలంలో లంకపాకలు, సప్పర్ల ప్రాంతంలో అరుదైన వృక్షాలు, చింతపల్లి మండలం కృష్ణాపురంలో హిమాలయాల్లో పెరిగే రాస్బెర్రీ చెట్లు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాన్ని రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటిస్తూ బయోస్పియర్‌పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

అనకాపల్లిటౌన్ : రోడ్డు ప్రమాదంలో బోరవు సాధు బాబు(60) శనివారం మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కశింకోట హౌసింగ్‌కాలనీకి చెందిన సాధుబాబు పట్టణంలో జాతీయ రహదారి మీదుగా సైకిల్‌పై వెళ్తుండగా ఉమ్మలాడ కూడలి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.

## వీకెండ్ సందడి


వలిసె తోటల్లో ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు

జి.మాడుగుల /డుంబ్రిగుడ: పర్యాటక ప్రాంతాల్లో వీకెండ్ సందడి నెలకొంది. ప్రకృతి అందాలను తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. కొత్తపల్లి జలపాతం పర్యాటకులతో కిటకిటలాడింది. జలపాతంలో స్నానాలు చేస్తూ, సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. కబాబులు, బొంగిచికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి. చాపరాయి జలపాతానికి పర్యాటకుల తాకిడి నెలకొంది. అరకు- పాడేరు ప్రధాన రోడ్డు మార్గాన్ని ఆనుకొని ఉన్న వలిసె పూల తోటల్లో పర్యాటకులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని సందడి చేశారు.

## వచ్చే నెలలో ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన


మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి

ఎటపాక: వచ్చేనెల రెండవ వారంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన ఉంటుందని కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి తెలిపారు. శనివారం మండలంలోని నెల్లిపాకలో గిరిజన ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈప్రాంత సమస్యలపై ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా గిరిజనాభివృద్ధే ధ్యేయంగా ఆయనకు నివేదించాలని సూచించారు. చైర్మన్ పర్యటన విజయవంతానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## రైలు నుంచి జారిపడి వృద్ధుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కశింకోట : తీర్థయాత్రలకు వెళ్లి వస్తూ మార్గమధ్యంలో రైలు నుంచి జారి పడి వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని నరసింగబిల్లి-బయ్యవరం రైల్వేస్టేషన్ల మధ్య శనివారం ఈ సంఘటన జరిగింది. తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ అందించిన వివరాల ప్రకారం..అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలానికి చెందిన సాగిన చిన్నయ్య పడాల్(60) తన కుటుంబ సభ్యులతో తీర్థయాత్రలకు వెళ్లి తిరిగి పుట్టపర్తి నుంచి దువ్వాడకు సూపర్‌ఫాస్టు రైలులో వస్తుండగా మార్గమధ్యంలో నరసింగబిల్లి-బయ్యవరం స్టేషన్ల మధ్య రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం ఆచూకీ గురించి విచారించి వివరాలు తెలియడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి బంధువుల కోసం భద్రపరిచినట్లు ఎస్ఐ మారూఫ్ తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారని తెలిపారు.

## నిత్య పెళ్లి కొడుకు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసుల

పాడేరు రూరల్ : ఒకరికి తెలియకుండా మరొకరిని మోసగిస్తూ నలుగురు మహిళలను పెళ్లి చేసుకున్న వ్యక్తిని పాడేరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పాడేరు సీఐ సుధాకర్ విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డుంబ్రిగుడ మండలం చెలిమరవలస గ్రామానికి చెందిన కొర్రా దామోదరం(37) అనే వ్యక్తి నలుగురు మహిళలను ఒకరికి తెలియకుండా మరొకరిని పెళ్లి చేసుకుని మోసగించాడని, పాడేరు పట్టణంలోని సుండ్రుపుట్టులో నివాసం ఉంటున్న అతడి నాలుగో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనతో శారీరకంగా సన్నిహితంగా ఉన్నప్పుడు ఆమెకు తెలియకుండా వీడియోలు తీసి ఆమె స్నేహితుడికి వాట్సప్‌లో చేరవేస్తున్నాడని, అది తెలిసిన బాధితురాలు ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఈ మేరకు నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. సమావేశంలో పాడేరు ఎస్ఐ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యగెడ్డలో గుర్తుతెలియని మహిళ మృతదేహం


మత్స్యగెడ్డలో తేలుతున్న మహిళ మృతదేహం

పెదబయలు : ఆంధ్ర –ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన పెదబయలు వంతెన కింద మత్స్యగెడ్డలో శనివారం గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. మత్స్యగెడ్డలో మృతదేహం తేలుతూ ఉండడాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీతగుంట సర్పంచ్ పలాసి మాధవరావు, వీఆర్‌వో కాతరి సత్యరావు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మహిళ మృతదేహంగా నిర్ధారించారు. మృతదేహం ఒడిశా సరిహద్దు వైపు వంతెన రెండో పిల్లర్ కింద ఉండడంతో ఒడిశా రాష్ట్రం పాడ్లుంగ్ పంచాయతీ పరిధిలోకి వస్తుండడంతో ఆ పంచాయతీ సర్పంచ్‌కు ఫోన్‌లో సమాచారం తెలియజేశారు. మహిళ ఒంటిపై పూర్తిగా దుస్తులు లేనట్టు ఉండడం, ఎవరైనా అత్యాచారానికి పాల్పడి హతమార్చారా లేక కుటుంబ కలహాలతో గెడ్డలో దూకి మరణించి ఉండవచ్చా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతదేహం ఒడిశా వైపు ఉండడంతో ఒడిశా అధికారులు, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ముఖం చేపలు తినేయడంతో మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉంది.